సాక్షి
కాకినాడ
శుక్రవారం । 24 । మార్చి । 2023



31న డాక్ అదాలత్


బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 31న మధ్యాహ్నం 3 గంటలకు 'డాక్ అదాలత్' నిర్వహించనున్నారు.



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అడబాల శ్రీరామారావు (కాకినాడ) రూ.1,00,116 విరాళాన్ని గురువారం దేవస్థానం అధికారులకు సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు గురువారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1850,మధ్య డెల్టాకు 1200,పశ్చిమ డెల్టాకు 3200క్యూసెక్కులు వదిలారు.



న్యూస్‌రీల్

మరిడమ్మ ఆలయ హుండీ రాబడి



హుండీల సొమ్ము లెక్కిస్తున్న ఆసాదులు, భక్తులు

పెద్దాపురం: గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి ఆలయానికి హుండీల ద్వారా 84 రోజులకు సుమారు 3.03 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు తెలిపారు. గురువారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు నాయుడు సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ హుండీలను తెరచి లెక్కించామన్నారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, శ్రీనివాస భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు



జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులతో స్కూల్ ప్రతినిధులు

తుని: ఈ నెల 27 నుంచి 31 వరకూ అస్సాంలో జరిగే 37వ జాతీయస్థాయి సబ్‌జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికై నట్లు ఆ విద్యాసంస్థల సీనియర్ ప్రిన్సిపల్ వీవీఎస్ మూర్తి గురువారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 13, 14వ తేదీల్లో కృష్ణాజిల్లా గన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు రాజాన కుమార్, లాలం దిలీప్, దొండా రేవంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, హెచ్‌ఎం డీవీ శ్రీనివాస్, కోచ్‌లు సురేష్, బాలరాజు అభినందించారు.

అకాల వర్షాలతో రైతులు అవస్థలు

450 హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యానవన పంటలు


బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నాలుగురోజులుగా జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు, వీస్తున్న ఈదురుగాలుల వల్ల ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురు గాలుల కారణంగా అరటి, మామిడితోటలు దెబ్బతిన్నాయి. గురువారం సాయంత్రం కూడా జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ గాలులు వీచాయి. పలుచోట్ల అరటి తోటలు నేలకొరిగాయి. ఏలేశ్వరం మండలంలో 110, ప్రత్తిపాడు 40, తొండంగి 60, శంఖవరం 95, రౌతులపూడి 19, గొల్లప్రోలు 18, యు కొత్తపల్లి 10, జగ్గంపేట 0.4 హెక్టార్లలో అరటి తోటలు నేలకొరిగాయి. వీటితో పాటు సుమారు 93 హెక్టార్లలో కూరగాయాలు, బొప్పాయి, మునగ, బంతిపువ్వుల తోటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బీవీ రమణ తెలిపారు. సుమారు 450 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయన్నారు. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత పూర్తి స్థాయి పంటల నష్టం అంచనాలు తయారు చేస్తామన్నారు. ఈ వర్షాల వల్ల వరిపంటకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్ విజయ్‌కుమార్ తెలిపారు.

శృంగవృక్షంలో డీఎస్పీ విచారణ

తొండంగి: మండలంలోని శృంగవృక్షం ఘర్షణలో ఒకరు వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గురువారం డీఎస్పీ బీ అప్పారావు విచారణ నిర్వహించారు. ఘర్షణలో గాయపడిన బాధితుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై సమగ్ర నివేదిక జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుకు సమర్పించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. గ్రామంలో పోలీసులు ఏర్పాటు చేసిన పికెట్ కొనసాగుతోంది. ఎటువంటి వివాదాలకు తావులేకుండా పికెట్ కొనసాగిస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

అదివో.. అల్లదివో..

- జాతీయ రహదారిపై సత్యదేవుని మరో నమూనా ఆలయం
- ఇక్కడ నుంచే రాజగోపురాల వీక్షణకు అవకాశం
- నిర్మాణానికి 4.20 ఎకరాల భూమి సేకరణ
- ప్రసాదం కౌంటర్, భక్తుల విశ్రాంతి మండపం కూడా ఏర్పాటుకు సన్నాహాలు



అన్నవరం గుడి ఏరియల్ వ్యూ

అన్నవరం: విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే జాతీయ రహదారిలో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం కనిపించగానే ఒక అలౌకిక ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది. అన్నవరం సమీపాన హైవే నుంచి లోపలికి కొంత దూరం వెళితే సత్యనారాయణస్వామి ఆలయం వస్తుంది. స్వామిని దర్శించుకోవాలనే భక్తులు జాతీయ రహదారి మీద నుంచి లోపలికి వెళ్తుంటారు. వివిధ పనులపై బిజీగా వెళ్తూ సమయం చాలక కొందరు హైవే నుంచి కొండవైపు చూస్తూ దేవుడ్ని మనసులోనే స్మరించుకుంటూ ముందుకు సాగుతుంటారు. ఇలాంటి భక్తుల కోరిక నెరవేర్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొండమీదకు వెళ్లకుండానే హైవే చెంతనే నమూనా ఆలయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

గతేడాది శంకుస్థాపన

జాతీయ రహదారి నుంచి అన్నవరం వైపు తిరిగే చోట దేవస్థానానికి 4.20 ఎకరాల భూమి ఉంది. ఇక్కడ సత్యదేవుని కొత్త నమూనా ఆలయం నిర్మించాలని సంకల్పించారు. ఈ ప్రదేశంలోనే స్వామివారి ప్రసాదాల విక్రయ కౌంటర్ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతేడాది ఆగస్టు 13న రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇక్కడ ఆలయంతోపాటు భక్తుల కోసం ఒక విశ్రాంతి మండపం నిర్మించనున్నారు. హోటల్, షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్ నిర్మాణానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మంత్రి చొరవతో అడుగులు

మంత్రి కొట్టు సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించాక విశాఖపట్నం వస్తూ జాతీయ రహదారిపై గల సత్యదేవుని నమూనా ఆలయం చూశారు. అక్కడి ఆగి అక్కడ పరిస్థితులను నిశితంగా గమనించారు. ఆలయం చాలా చిన్నదిగా ఉందని గుర్తించారు. భక్తుల వసతుల కల్పనకు అక్కడ తగిన స్థలం లేదని గుర్తించారు. రాజమహేంద్రవరం వైపు రహదారిపై ప్రయాణించే భక్తులు ప్రసాదం కొనుగోలుకు రోడ్డు దాటి వచ్చే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని భావించారు. భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయంతోపాటు, ప్రసాదం కౌంటర్ కూడా ఏర్పాటు చేయాలని వెంటనే నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని శ్రీసత్యదేవ డిగ్రీ కళాశాల సమీపంలో దేవస్థానానికి గల 4.20 ఎకరాల భూమి ఉందని ఆలయ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. స్థలాన్ని పరిశీలించి నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదే స్థలంలో సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రెండు రాజగోపురాల వీక్షణ భాగ్యం

నమూనా ఆలయ నిర్మాణ స్థలం నుంచి చూస్తే సత్యదేవుని ఆలయంతోపాటు రెండు రాజగోపురాలు కూడా స్పష్టంగా కనిపిస్తుంటాయి. ఇటువంటి చోట నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ నిర్మిస్తే భక్తులు, వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. స్వామివారికి దండిగా ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉంది. షాపింగ్ కాంప్లెక్స్, లగ్జరీ హోటల్ వంటివి కూడా నిర్మించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. త్వరలో అన్నవరంలో ఇదో పెద్ద సెంటర్‌గా రూపుదిద్దుకోనుందనడంలో సందేహం లేదు.

కౌలుదారు నుంచి భూమి స్వాధీనం

నమూనా ఆలయం నిర్మించాలని ప్రతిపాదించిన స్థలం ప్రస్తుతం కౌలు రైతు స్వాధీనంలో ఉంది. ఆరు నెలలు గడచినా కనీసం స్థలం స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నాలు జరగలేదు. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆధ్వర్యంలో దేవస్థానం అధికారులు ఈ నెల18న కదిలారు. ఎట్టకేలకు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. కౌలు విషయమై న్యాయపరమైన వివాదం ఉండడంతో పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విశాఖపట్నం-రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై ప్రయాణికుల సౌకర్యార్థం వచ్చే సాధారణ ఎన్నికల్లోపు నమూనా ఆలయం నిర్మించాలని మంత్రి మరోమారు ఆదేశించారు. దీంతో అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ నిర్మాణాలకు టెండర్లు పిలిచేందుకు అడుగులేస్తున్నారు. ఈ నిర్మాణాలకు రూ.రెండు కోట్లు వ్యయమవుతుందని ప్రాథమిక అంచనా



నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ (ఫైల్)



భూమి స్వాధీనం చేసుకుంటున్న ఇన్‌ఛార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్, దేవస్థానం అధికారులు

రత్నగిరిపై 'స్క్రాప్ వేలం ద్వారా ఆదాయం

అన్నవరం: సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని వివిధ విభాగాలలో వ్యర్థాలను (స్క్రాప్)' గురువారం వేలం వేశారు. తద్వారా రూ.4 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం ఇన్‌ఛార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఈ నెల 4న వనదుర్గ ఆలయం సమీపంలో విద్యుత్ పరికరాలు, ఇతర వ్యర్థాల గమనించి వెంటనే వేలం వేయాలని ఆదేశించారు. ఇతర విభాగాలలో పేరుకు పోయిన వాటిని కూడా వేలం వేయాలన్నారు. ప్రకాష్ సదన్ సత్రం వెనుక వ్యర్థాలను గుట్టగా పోసి గురువారం వేలం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, ఈఈ మురళీ, డీఈ గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలకు 25 శాతం సీట్ల కేటాయింపునకు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హులైన కుటుంబాలు ఏప్రిల్ పదో తేదీలోపు విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈనెల నాలుగో తేదీన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్‌లలో 25 శాతం సీట్లలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాల పిల్లలు, దివ్యాంగులు, అనాథ, హెచ్ఐవీ బాధిత పిల్లల కోసం ఐదు శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, బలహీన వర్గాల పిల్లలకు ఆరు శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ సిలబస్‌ల పాఠశాలల్లో ప్రవేశం కోరే విద్యార్థికి ఏప్రిల్ 1, 2023, స్టేట్ సిలబస్‌లో ప్రవేశం కోరే విద్యార్థికి జూన్ 1, 2023 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు తమ నివాస ప్రదేశానికి మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

27న రత్నగిరి ధర్మకర్తల మండలి సమావేశం

అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి తొలి సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నారు. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్ అధ్యక్షతన సమావేశం జరుగనుంది. ఛైర్మన్‌తో సహ 16 మంది సభ్యులకు సమావేశం సమాచారంతో పాటు ఆ రోజు చర్చించే అజెండా కాపీలు పంపించినట్లు అధికారులు తెలిపారు. సమావేశానికి ముందు రామాలయం పక్కన గల విశ్రాంతి మండపంలో ట్రస్టీలకు అభినందన సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, శాసనసభ్యులు హాజరవుతారని సమాచారం. తరువాత కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ట్రస్టుబోర్డు సమావేశం జరుగుతుంది. గతంలో ధర్మకర్తల మండలి సమావేశం ప్రకాష్ సదన్ సత్రం దిగువన గల హాలులో జరిగేది. రామాలయం పక్కన కమాండ్ కంట్రోల్ రూమ్ అన్నింటికీ దగ్గరగా ఉంటుందనే అభిప్రాయంతో ఇన్‌ఛార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఇక్కడ సమావేశం నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. మండలిలో ఛైర్మన్‌గా ఐవీ రోహిత్, సభ్యులుగా కొట్టిం పశువుల రావు, తాడి రజని, దోశీ వీర సూర్యనారాయణ, నక్కా అశ్విని, సాపిశెట్టి భూలక్ష్మి, పేరూరి బద్రీ నారాయణ, బొద్దాని విజయలక్ష్మి, నున్న నరిసింహరావు, కడియాల లక్ష్మణరావు, కర్రి భామిరెడ్డి, రాయుడు సూర్యావతి, కేవీ నాగేశ్వరరావు, నేతల వేంకట లక్ష్మి, కారుకోడి పోచమ్మ, ట్రస్ట్ బోర్డు ఎక్స్‌అఫీసియో సభ్యుడు, దేవస్థానం ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఉన్నారు.



ట్రస్ట్‌బోర్డు సమావేశం జరిగే కమాండ్ కంట్రోల్ రూమ్

నేటి నుంచి రంజాన్ ప్రారంభం

- ముస్లింల ఉపవాస దీక్షలు
- ముస్తాబైన మసీదులు



రంజాన్ దీక్షల కోసం ముస్తాబైన మామిడికుదురు సున్నీ జామియా మసీదు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైంది. ఈ నెలలోనే దివ్య ఖురాన్ అవతరించింది. రంజాన్ అంటే ఒక నెల పేరు. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం తొమ్మిదో నెల. ఈ నెలలో ముస్లింలు ఉపవాసాలు పాటిస్తూ తమను తాము సంస్కరించుకుంటూరు. అల్లాహ్‌పై విధేయతను ప్రకటిస్తూ, అల్లా విధించిన కట్టుబాట్లను ఆచరిస్తూ క్రమశిక్షణ జీవితాన్ని గడుపుతారు. ఉపవాసం మనలోని మాలిన్యాన్ని కడిగేయడానికి ప్రయత్నిస్తుంది. చెడును దూరం చేసి సత్ప్రవర్తన వైపు నడిపిస్తుంది

ఉపవాస నియమాలు

వేకువజామున 4:30 గంటల లోపు (సహరి) భోజనాది కార్యక్రమాలు పూర్తిచేయాలి. మళ్లీ సాయంత్రం 6.30 వరకు (ఇఫ్తార్) వరకు ఎటువంటి ఆహారం, నీరు తీసుకోకూడదు. రోజూ సుమారు 14 గంటల వరకు ఈ ఉపవాస దీక్ష ఉంటుంది. సహరితో మొదలై ఇఫ్తార్‌తో రోజా ముగుస్తుంది. ఉపవాసం ఉన్న వ్యక్తి చెడు తలంపులకు దూరంగా ఉండాలి. అబద్ధాలు చెప్పకూడదు. ఘర్షణలకు దిగకూడదు. ఎవరైనా ఘర్షణకు దిగినా, నేను ఉపవాసంలో ఉన్నానంటూ చెప్పాలి.

ఇఫ్తార్ సమయం

సహనం మన జీవితంలో భాగమయ్యేటట్లు ఇఫ్తార్ చేస్తుంది. సుమారు 14 గంటల పాటు కఠిన ఉపవాస దీక్షలో ఉన్న వ్యక్తి ఇఫ్తార్ (ఉపవాస విరమణ) సమయంలో కాస్త నీరసంగా కనిపిస్తారు. కళ్ల ముందే అన్ని రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. కానీ నిర్ణీత ఉపవాస విరమణ ఘడియ వచ్చే వరకు ఏ ఒక్క ఆహార ప దార్థాన్ని తాకరు. సహనం వీడరు. ఎవరైతే కష్టసమయంలో సహనం, ఓర్పు వహిస్తారో వారిపై తన కరుణ ఎల్లప్పుడూ ఉంటుందని అల్లాహ్ ఖురాన్‌లో తెలిపారు.

ఉపవాస దీక్ష లక్ష్యాలు

ఉపవాసాల లక్ష్యం ఏమిటంటే మనలో భయభక్తులు, దైవభీతి, జవాబుదారీతనం జనించాలని, దైవంపై కృతజ్ఞతాభావం కలగాలని, అందరికీ ఉత్తమ నైతిక గుణగణాలు అలవడి వారి ద్వారా ఒక మంచి శాంతి నైతికతా సమాజం ఏర్పడడం. నెలరోజులు పాటు ఉపవాసాల శిక్షణ రాబోయే 11 నెలలు కొనసాగించడమే దీనిస్ఫూర్తి.

కనిపించిన నెలవంక

నెలవంక రాకతో రంజాన్ మాసం ప్రారంభం అవుతుంది. రాజమహేంద్రవరంలో గురువారం రాత్రి నెలవంక కనిపించింది. దీనితో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు ముస్లిం ప్రతినిధులు తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి.

అంకితభావానికి 'పెద్ద' పీట

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలుపొందిన ఇజ్రాయిల్
- సామాజిక సమతూకం పాటించిన వైఎస్సార్ సీపీ



ఎమ్మెల్సీగా గెలిచిన ఇజ్రాయిల్‌ని అభినందిస్తున్న ఎంపీ అనురాధ తదితరులు

సాక్షిప్రతినిధి,కాకినాడ: చరిత్రలో తొలిసారి మాదిగ సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ పెద్ద పీట వేసింది. గురువారం ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి చెందిన బొమ్మి ఇజ్రాయేల్ విజయం సాధించారు. ఈ ఎన్నికతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయ చరిత్రలో ఆ సామాజిక వర్గానికి పెద్దల సభలో తొలిసారి ప్రాధాన్యం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి ఎస్సీ బీసీలకు ప్రాధాన్యతను ఇస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారు. బీసీలలో బలమైన శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి ఉభయ తెలుగురాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణరావును ఎమ్మెల్సీగా చేశారు. ఈ రెండు సామాజికవర్గాలతో పాటుగా గవర్నర్ కోటాలో మత్స్యకార సామాజికవర్గం(వాడబలిజ) నుంచి కర్రి పద్మశ్రీని ప్రతిపాదించారు. ఇలా ఎస్సీ బీసీలకు పార్టీ విధానపరంగా ప్రాతినిధ్యం కల్పిస్తూ అగ్రాసనం వేయటంపై ఆయా వర్గాలలో హర్షాతికేరాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తంగా ఏడుగురికి పెద్దల సభలో ప్రాతినిధ్యం కల్పించినట్టయ్యింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీ నుంచి ఎస్సీ సామాజికవర్గం నుంచి పండుల రవీంద్రబాబు, కాపు సామాజికవర్గం నుంచి తోట త్రిమూర్తులు ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆవిర్భావం నుంచి పార్టీ పట్ల అంకిత భావంతో ఆ సామాజికవర్గం నుంచి ఇజ్రాయేల్ ఉన్నారు. ఇందుకు ప్రతిఫలంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ అవకాశాన్ని ఇజ్రాయేల్‌కు కల్పించారు.

ఎంపీ అనురాధ శుభాకాంక్షలు

అల్లవరం: విజయం సాధించిన ఇజ్రాయిల్‌కు ఎంపీ చింతా అనురాధ, ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ తదితరులు అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇజ్రాయిల్ గెలుపుతో గోడిలోని ఆయన నివాసం వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు. జై జగన్.. జైజై జగన్ అంటూ అభిమానులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

సంపూర్ణ పోషణ పథకంపై ప్రత్యేక దృష్టి

అధికారులతో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న ఆహారం గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఎస్డీజీ ప్రాధాన్య అంశాలపై వివిధ శాఖల అధికారులు ఫోకస్ పెట్టాలన్నారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి శిశుసంక్షేమం తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పాలు, గుడ్లు, ఇతర పౌష్టికాహారం, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా తినేలా చూడాలన్నారు. ఈ పౌష్టికాహారం తినడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు వయసుకు తగ్గ బరువు, ఎత్తు కలిగి ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో గర్భవతులను గుర్తించి ప్రత్యేక నంబర్ కేటాయించాలని కృతికా శుక్లా ఆదేశించారు. ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ ఆధార్ నమోదు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఆధార్ నమోదుకు నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, డీఎంఅండ్‌హెచ్‌వో ఆర్ రమేష్, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, డీఐవో డాక్టర్ ఐ ప్రభాకర్,డాక్టర్ పీబీ విష్ణువర్ధిని పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

- మార్కెట్‌పై రైతుల సంతృప్తి
- కిలో గరిష్ట ధర రూ.210
- నగటు రేటు రూ.206
- ఐదు వేలం కేంద్రాల్లో మొదలైన విక్రయాలు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో గురువారం పొగాకు కొనుగోళ్లు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.59 గంటలకు దేవరపల్లి వేలం కేంద్రంలో బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ కొనుగోళ్లు ప్రారంభించగా, గోపాలపురం వేలం కేంద్రంలో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. కిలో పొగాకు ప్రారంభ గరిష్ట ధర రూ.210 పలికింది. గత ఏడాది కిలో ప్రారంభ ధర రూ.195 కాగా, కొనుగోళ్లు ముగిసేనాటికి రూ.245 పలికింది. ఈ ఏడాది మార్కెట్లో ప్రారంభ ధరపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే కిలోకు రూ.15 అదనంగా పెట్టి ప్రారంభ ధరను నిర్ణయించడంతో భవిషత్‌లో మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. దేవరపల్లి వేలం కేంద్రానికి చెరుకుమిల్లి క్లస్టర్ నుంచి 18 బేళ్లు, తూర్పుగోదావరి జిల్లా తొర్రేడు వేలం కేంద్రం(ప్రస్తుతం లేదు) పరిధిలోని గ్రామాల నుంచి తొమ్మిది బేళ్లు రైతులు వేలానికి తీసుకువచ్చారు. తొలిరోజు వేలం కేంద్రంలో 3,758 కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలో సగటు ధర రూ.206 పలికింది. ఎనిమిది కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి.



గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని ప్రారంభించి, పొగాకును పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రారంభ ధర కిలో రూ.225 ఆశించాం



కిలో పొగాకు ప్రారంభ ధర రూ.225 ఉంటుందని అనుకున్నాం. కొనుగోలుదారులు రూ.210 ఇచ్చారు. సగటు ధర రూ.220 ఇస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ఉత్పత్తి వ్యయం 30 శాతం పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్లో గిట్టుబాటు ధరకు పంటను కొనుగోలు చేయాలి.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు వేలం కేంద్రం, దేవరపల్లి

ఖర్చులు పెరిగాయి



తూర్పుగోదావరి జిల్లాలోని తొర్రేడు వేలం కేంద్రం పరిధిలోని ఉత్తర నల్లరేగడి భూముల్లో(ఎస్‌ఎల్‌ఎస్) పండిస్తున్న పొగాకును దేవరపల్లి వేలం కేంద్రంలో అమ్ముకోవలసి వస్తుంది. దీనివల్ల బేలుకు రూ.250 రవాణా ఖర్చులు అవుతున్నాయి. పెట్టుబడి తక్కువైనప్పటికీ రవాణా, ఎరువులు, బంటా, క్యూరింగ్ ఖర్చులు ఎక్కువ. 1,057 మంది రైతులు, 1,450 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు తొమ్మిది క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

– కాట్రగడ్డ సత్యనారాయణ, అధ్యక్షుడు, పొగాకు రైతు సంఘం, తొర్రేడు

నాణ్యత బాగుంది




ఈ ఏడాది పొగాకు నాణ్యత, దిగుబడులు బాగున్నాయి. మార్కెట్ కూడా ఆశాజనకంగా ఉంటుందని అనుకుంటున్నాను. తొలి రోజు ఐదు వేలం కేంద్రాల్లో కిలో ప్రారంభ ధర రూ.210 పలికింది. మార్కెట్లో అమ్ముడు పోయే బేళ్లను రైతులు వేలం కేంద్రాలకు తీసుకురావాలి. క్లస్టర్ వారీగా వేలం జరుగుతుంది. ఎనిమిది కంపెనీలు వేలంలో పాల్గొని కొనుగోలు చేశాయి.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు, రాజమహేంద్రవరం

వివాహితకు న్యాయం చేయాలంటూ ఆందోళన

ఉప్పలగుప్తం: పెళ్లి చేసుకుని కొన్ని రోజుల కాపురం చేసి వదిలేసిన వ్యవహారంలో భార్యకు న్యాయం చేయాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేశారు. మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెంలో భర్త ఇంటి వద్ద బాధితురాలు హేమలతతో కలసి గురువారం ఈ ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ఐ.హేమలత డిగ్రీ వరకు చదువుకుంది. 2018లో భీమనపల్లి పంచాయతీ శివారు సూదాపాలెంకు చెందిన ఇళ్ల రమేష్‌తో పెద్దల సమక్షంలో వివాహం కుదిరింది. కొన్ని కారణాల వల్ల పెళ్లి వాయిదా పడి 2020 డిసెంబర్ 24న హేమలత రమేష్‌లకు వివాహం జరిగింది. 48 రోజులు హేమలతతో కాపురం చేసిన రమేష్ అనంతరం తనకు పెళ్లి ఇష్టం లేదని, హేమల తను పుట్టింటికి పంపి తాను హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు హేమలత ఐద్వాను ఆశ్రయించడంతో హేమలత భర్త రమేష్ ఇంటి వద్ద ఐద్వా మహిళలు ఆందోళనకు దిగి హేమలతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రమేష్ కుటుంబ సభ్యులను సంప్రదించగా తమకు ఈ విషయంలో సంబంధం లేదని, రమేష్ ఆచూకీ కూడా తెలియదని చెప్పారని ఐద్వా మహిళలు తెలిపారు. ఈ విషయమై అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆందోళనలో ఐద్వా సంక్షేమ జిల్లా అధ్యక్షురాలు ఎం.డి.అమీదా, కార్యదర్శి టి.నాగలక్ష్మి, గ్రామ కమిటీ సభ్యులు రాయుడు గౌరీ, గుత్తుల తేజకుమారి, డి.దుర్గాభవాని, వి.దుర్గ, ఆర్.దేవి, వి.జ్యోతి పాల్గొన్నారు.

అరుణ కాంతులీనిన రామలింగేశ్వరుడు



అరుణ కిరణ కాంతిలో రామలింగేశ్వరుడు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమా రామలింగేశ్వరుడిని గురువారం సూర్య కిరణాలు తాకాయి. అరుణ కిరణ కాంతిలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భానుడి స్పర్శతో గర్భాలయం వెలుగులీనింది. ఏటా మార్చి, సెప్టెంబర్‌లలో రెండు సార్లు సూర్య కిరణాలు స్వామిని తాకుతాయని ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మున్సిపల్ ఉద్యోగి ఆత్మహత్య

పిఠాపురం: మున్సిపల్ ఉద్యోగి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో 15 ఏళ్లుగా అటెండర్‌గా పనిచేస్తున్న ఆర్.గోవిందరాజులు (42) స్థానిక అగ్రహారం రెల్లిపేటలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వీడెన్ బ్లేకింగ్ యూనివర్సిటీతో జేఎన్‌టీయూకే ఒప్పందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే స్వీడన్‌లో బ్లేకింగ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీతో కొనసాగిస్తున్న కోర్సుల నిర్వహణపై గురువారం రెండు యూనివర్సిటీల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే స్వీడన్‌లోని బ్లేకింగే యూనివర్సిటీ ద్వారా కుదుర్చుకున్న కోర్సుల ఒప్పందం యథావిధిగా కొనసాగించడంతోపాటు ఆదరణ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సు ఈ ఏడాది అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. అడ్మిషన్‌కు నోటిఫికేషన్ జారీ చేసి ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎంవోయుపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. బ్లేకింగ్ అధికారులు బృందం జేఎన్‌టీయూకేలో ఈసీఈ, సీఎస్ఈ విభాగాలను సందర్శించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించింది. వీసీ ప్రొఫెసర్ మార్ట్స్ వైబెర్గ్, డిప్యూటీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గురుదత్త వేల్పుల, కో-ఆర్డినేటర్ ఫణిశేఖర్, జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డీఏఏ సీహెచ్ సాయిబాబు, డీఏపీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ రవీంద్ర, డీఈ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణంరాజు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న బ్లేకింగ్ వర్సిటీ వీసీ మార్ట్స్ వైబెర్గ్, జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరాజు

క్రైం కార్నర్..

భార్యపై హత్యాయత్నానికి 10 ఏళ్ల జైలు

పిఠాపురం: భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను అంతం చేయాలని ప్రయత్నించి హత్యాయత్నం చేసిన భర్తకు న్యాయమూర్తి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం ముమ్మిడి సుబ్రహ్మణ్యం, భార్య సుబ్బలక్ష్మి పిఠాపురం ఐశ్వర్య గార్డెన్స్‌లో నివాసముండేవారు. భర్త సుబ్రహ్మణ్యం సౌత్ ఈస్టన్ సెంట్రల్ రైల్వేలో బిలాస్‌పూర్ మేనేజర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పిఠాపురంలో ఉంటూ సుదూర ప్రాంతానికి ఉద్యోగం కోసం వెళ్లి వస్తుండే అతను.. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఆమె పేరున ఉన్న 10 ఎకరాల భూమిని తన పేరుపై రాయాలంటూ ఒత్తిడి తెచ్చేవాడు. అయితే 'నా ఆస్తి మన ఇద్దరికీ చెందుతుంది. మీ పేరున రాయడం ఎందుకు అంటూ' భార్య వ్యతిరేకించడంతో ద్వేషం పెంచుకున్నాడు. ఎలాగైనా ఆమెను అంతం చేయాలని పన్నాగం పన్నాడు. 25 మే 2018వ తేదీన ఇంటి వద్దే ఉన్న భర్త తన భార్యను తీసుకుని కొత్తపల్లి మండలం కొండెవరం బంధువుల ఇంటికి వెళ్లి వచ్చాడు. ఆరోజు రాత్రి 9–30 గంటల ప్రాంతంలో భార్య నిద్రపోగానే ఆమెపై మత్తు మందు చల్లాడు. ఆమె మత్తులోకి వెళ్లిపోగానే కత్తితో విచక్షణారహితంగా నరికి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆమెకు రెండు చేతులు మణికట్టు వద్ద తెగిపోగా పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఆ మరునాడు ఉదయం 6 గంటల సమయంలో మత్తు వదలి మెలుకువ వచ్చిన ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై 26 మే 2018లో అప్పటి పిఠాపురం పట్టణ ఎస్సై శోభన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె. మాధవి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ దామెర కిరణ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

వ్యక్తి మృతి కేసులో 11 మంది అరెస్టు

తొండంగి: ఎపోలీస్ స్టేషన్ పరిధిలో శృంగవృక్షం గ్రామంలో శ్రీ నూకాలమ్మ తల్లి, శ్రీ పెద్దింట్లమ్మ తల్లి అమ్మవార్ల జాతర సందర్భంగా జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతికి కారణమైన 11మందిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ బి.అప్పారావు గురువారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ రాత్రి గరగల ఊరేగింపు జరిగే సమయంలో రెండు వర్గాల వారి మధ్య ఘర్షణ జరిగింది. రెండు వర్గాల యువకులు వీధిలో గుమికూడి ఘర్షణకు దిగారని పేర్కొన్నారు. ఈ ఘర్షణ పెద్దదిగా మారి ఒక వర్గంలోని కొంతమంది మరొక వర్గానికి చెందిన వారిపై దాడి చేశారు. అమ్మవార్ల గుడి వద్ద బందోబస్తులో ఉన్న ముగ్గురు పోలీస్ సిబ్బంది వెంటనే వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనలో గాయాలైన వారిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో తొండంగి గ్రామానికి చెందిన నడిపల్లి రాము (22) మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై తొండంగి పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేసినట్టు డీఎస్పీ అప్పారావు తెలిపారు. ఈ కేసులో అడపా సురేష్, బస్వా గంగాధరరావు, అడపా సాయిభాస్కర్, కందికొండ లోవదొర, బొబ్బది వీర వెంకట రాజు (వెంకటేష్), కంద మణికంఠ, మానం శ్రీనివాస్ (శ్రీను), బస్వా శివ శంకర ప్రసాద్(శివ ప్రసాద్), బొట్టు సత్తిబాబు, బస్వా మణికంఠ, గూడ కృష్ణశంకర్ (వంశీ) లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. మరొక నిందితుడు పాలపర్తి అచ్చెన్న పరారీలో ఉన్నాడని తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు

రౌతులపూడి: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాపై రౌతులపూడిలో దాడి చేసినట్లు అన్నవరం ఎస్సై పి.శోభన్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నాడని ఎస్సై వివరించారు. కేరళ రాష్ట్రానికి చెందిన మహ్మద్ స్వలై తెక్తరతొడిక, అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పల్లావూరు గ్రామానికి చెందిన పల్లా వరహాలబాబు, అదే జిల్లా కేడీ పేట గ్రామానికి చెందిన ఉప్పాటి వెంకటేష్‌లను అరెస్టు చేయగా సయ్యద్ ఉద్దీన్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి రూ. 22 కేజీల గంజాయి స్వాధీన పరుచుకున్నామన్నారు. దీని విలువ రూ.66 ఉంటుందన్నారు. మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అలరిస్తున్న నాటికలు

రావులపాలెం: ఉగాది పండగను పురస్కరించుకుని రావులపాలెంలోని కాస్మోపాలిటన్ రిక్రియేషన్‌క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 23వ ఉగాది జాతీయ తెలుగు నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. రెండో రోజు పోటీలను తిలకించేందుకు పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీ నటుడు తనికెళ్ళ భరణి, సినీనటులు కోట శంకరరావు, గౌతంరాజు, సైనా, కృష్ణ చైతన్య, తదితరులు హాజరయ్యారు. గురువారం మూడు నాటికలు ప్రదర్శించారు. వరంగల్ ఓరుగల్లు శారదా నాట్యమండలి వారి ఫ్రీడమ్ ఫైటర్, హైదరాబాద్ కళాంజలి వారి రైతేరాజు, కాకినాడ శ్రీ సాయి కార్తిక్ క్రియేషన్ వారి ఎడారిలో వాన చినుకు నాటికలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ వెలగల సతీష్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఫ్రీడమ్ ఫైటర్

తన జీవితాన్ని మాతృభూమి కోసం తృణ ప్రాయంగా వదిలేసి, వ్యక్తిగతంగా ఎన్నో సంఘర్షణలను అనుభవించి ఒక స్వాతంత్ర్య సమరయోధురాలు ఈ సమాజానికి సంధించిన ప్రశ్న మా ఈ ఫ్రీడమ్ ఫైటర్ అంటూ సాగిన నాటిక ఆకట్టుకుంది.

రైతేరాజు

ఇవాళ టెక్నాలజీ పెరిగింది. పిడికెడంత సెల్‌ఫోన్‌తో ప్రపంచాన్నే శాసిస్తున్నారు. కానీ రైతు పండించే పిడికెడంతా అన్నం తినకుండా ఏ మనిషీ బతకలేడు. అలాంటి రైతన్నను పట్టించుకునే నాథుడే లేడు. గుండుసూది నుంచి విమానం దాకా ఏ వస్తువైనా తయారు చేసిన వాడు తన వస్తువు రేటు నిర్ణయించుకుంటాడు. రైతుకు మాత్రం రేటు నిర్ణయించుకునే హక్కు లేదు. రైతు కన్నెర్ర చేస్తే, పంటకు సెలవు ప్రకటిస్తే, ఆలోచించమని చెప్పే నాటికే రైతే రాజు.



ఫ్రీడమ్ ఫైటర్ నాటికలో ఆకట్టుకున్న ఒక సన్నివేశం

ఎడారిలో వాన చినుకు

సురేష్ తన తల్లిదండ్రులైన శారదమ్మ, సుందరయ్యలను వృద్ధాశ్రమంలో వదిలేస్తాడు. అమెరికా నుంచి వచ్చిన మనోజ్ వారిని తల్లిదండ్రులుగా దత్తత తీసుకుందామని అనుకుంటే, సురేష్ వారిని పాతిక లక్షల రూపాయలకు బేరం పెడతాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయమే ఎడారిలో వాన చినుకు నాటిక సారాంశం. ఈ నాటిక ప్రేక్షకులకు కంటనీరు పెట్టించింది.